
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 10 | జులై | 2026 • పేజీలు : 6

## ప్రతి భూమికి భూధార్ యూనిక్ నంబర్ కేటాయింపు

**రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్**



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 9,(ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూధార్ యూనిక్ నంబర్ కేటాయించే లక్ష్యంతో చేపడుతున్న భూముల రీ సర్వేను సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, సర్వేయర్ల శిక్షణ

మిగతా 2 లో...





6 లో..

# ఇదే నా శపథం..!

• "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లను" • తప్పుడు ప్రచారాలకు ఒక్క మాటతో చెక్ పెట్టిన కల్వకుంట్ల కవిత • బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలపై ఒకేసారి విమర్శల వర్షం • ఫీనిక్స్ భూముల నుంచి కాళేశ్వరం వరకు ప్రభుత్వాలపై వరుస ఆరోపణలు • సింగరేణి పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ.. • కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటన • మెడికల్ బోర్డులు నిర్వహించకపోతే ఈ నెల 20 నుంచి నిరాహార దీక్ష హెచ్చరిక • రైతులు, కార్మికులు, ఉద్యమకారుల హక్కుల కోసం నిరంతర పోరాటమే లక్ష్యమన్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

## గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఇద్దరు యువకులు

మెదరబస్తీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన కొత్త గూడెం 3 టౌన్ పోలీసులు

డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ వెల్లడి

2 లో...




- యథేచ్ఛగా సాగుతున్న మట్టి దందా?
- అక్కడ లోడింగ్... ఇక్కడ అన్‌లోడింగ్..!
- సింగరేణి మండలం నుంచి ఇల్లందుకు ఎర్రమట్టి అక్రమ రవాణా?
- రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి!
- అధికారులకు కనిపించడం లేదా..?
- తెలిసి కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారా..?
- ఉన్నతాధికారులు జర స్పందించరూ
- ఎర్రమట్టి దందాకు కళ్లెం వేయరూ




2 లో..

# కరిగిపోతున్న ఎర్రమట్టి గుట్ట

## ప్రతి భూమికి భూధార్ యూనిక్





## నంబర్ కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి...)

సాంకేతిక ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ మొదటి దశలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ రోవర్స్, జి ఐ ఎస్ సాంకేతికతను వినియోగించి ప్రతి భూమి సరిహద్దులను నిర్ధారించి, ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూధార్ యూనిక్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. రీ సర్వే ప్రారంభానికి ముందు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, రైతులు, భూ యజమానులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. సర్వేయర్లకు సమగ్ర శిక్షణ ఇచ్చిన అనంతరమే రీ సర్వేను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భూ భారతి కింద అందుతున్న దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు రెవెన్యూ సేవలు అందేలా అన్ని జిల్లాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఐ డి ఓ సి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో రీ సర్వేను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. భూ భారతి వెబ్‌సైట్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్ అంకిత్, వాటి పరిష్కారానికి తగిన సాంకేతిక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వెబ్‌సైట్ సమస్యలు పరిష్కారమైతే దరఖాస్తుల పరిశీలన మరింత వేగవంతమై, ప్రజలకు సేవలు సకాలంలో అందుతాయని వివరించారు

## గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఇద్దరు యువకులు

**కొత్తగూడెం క్రైమ్, జూలై 9 (ప్రజాజ్యోతి)** మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను కొత్తగూడెం 3 టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారం ఆధారంగా కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చట్టపరమైన ప్రక్రియలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. యువకులకు గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం వారిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరిచి డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. గంజాయి కొనుగోలు, విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యాసంస్థల యాజ మాన్యాలు, ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు..

- యథేచ్ఛగా సాగుతున్న మట్టి దందా?
- అక్కడ లోడింగ్... ఇక్కడ అన్‌లోడింగ్..!
- సింగరేణి మండలం నుంచి ఇల్లందుకు ఎర్రమట్టి అక్రమ రవాణా?
- రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి!
- అధికారులకు కనిపించడం లేదా..?
- తెలిసి కూడా చూసీ చూడనట్లు వ్యవహరి స్తున్నారా..?
- ఉన్నతాధికారులు జర స్పందించరూ
- ఎర్రమట్టి దందాకు కళ్లెం వేయరూ



# కరిగిపోతున్న ఎర్రమట్టి గుట్ట

**ఇల్లందు, జులై 9 (ప్రజా జ్యోతి)** సింగరేణి మండల పరిధిలోని ఎర్ర మట్టి గుట్టలు రోజురోజుకూ కనుమరుగవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే పెద్దఎత్తున ఎర్రమట్టిని జెసిబి లతో త్రవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇల్లందు ప్రాంతానికి తరలిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం బహిరంగంగానే కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.



### అక్కడ లోడింగ్... ఇక్కడ అన్‌లోడింగ్

సింగరేణి మండలంలోని పొలంపల్లి గ్రామంలోని ఓ ఎర్రమట్టి గుట్ట వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇష్టానుసారంగా ఎర్రమట్టి లోడింగ్ జరుగుతుండగా, అదే మట్టి ఇల్లందు పరిధిలోని నిర్మాణ ప్రదేశాలు, ప్రైవేట్ స్థలాలు, ఓ ప్రధాన వ్యక్తి ఆన్ లోడింగ్ చేసి భారీగా విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు ఈ రవాణాలో నిమగ్నమవుతున్నాయని సమాచారం.

### కరిగిపోతున్న ఎర్ర మట్టి గుట్టలు

సింగరేణి మండలం పొలంపల్లి గ్రామ సమీపంలో కొన్ని ఏళ్ల తరబడి సహజంగా ఉన్న ఎర్రమట్టి గుట్టలు ఇటీవల వేగంగా కరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరంతర తవ్వకాలతో గుట్టల స్వరూపమే మారిపోతుందని భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యతపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతుంది.

### దర్జాగా సాగుతున్న దందా..?

సింగరేణి మండలం పొలంపల్లి గ్రామ సమీపంలో గల ఎర్రమట్టి గుట్టను జెసిబి సహాయంతో పగటిపూటే వాహనాల ద్వారా మట్టి తరలింపు జరుగుతున్నా, సంబంధిత శాఖల తనిఖీలు కనిపించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### అనుమతులు ఉన్నాయా? రాయల్టీ చెల్లిస్తున్నారా?

సాధారణంగా ఎక్కడి నుంచి ఎంత మట్టి తరలిస్తున్నారనే అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల మౌనంపై అనుమానాలు రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులకు ఈ వ్యవహారం కనిపించడం లేదా? తెలిసి కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్న శాఖలు స్పందించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది.

### ప్రభుత్వ ఆదాయానికి గండి

సింగరేణి మండలం పొలంపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఎర్రమట్టి గుట్టను కొందరు దర్జాగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలించుకుపోవడం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అక్రమ రవాణా కొనసాగితే సహజ వనరులు నష్టపోవడంతో పాటు ప్రభుత్వ ఖజానాకూ గండి పడే పరిస్థితి ఏర్పడుతుందని అభిప్రాయపడుతున్నారు.

### దందా నడిపిస్తున్న ఆ వ్యక్తి ఎవరో?

సింగరేణి మండలం పల్లి గ్రామంలోని నాగయ్య గుంపు సమీపంలో గల ఎర్ర మట్టి దందా కొనసాగిస్తున్న వ్యక్తి ఎవరోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. తమను ఎవరు ఏమీ చేయలేరనే ధీమాలో సదరు వ్యక్తి ఇష్టానుసారంగా రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు కళ్లకు కనిపిస్తుంది. అసలు ఆ వ్యక్తికి.. ఈ ఎర్ర మట్టి దందాకు సంబంధం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి వరకు జెసిబిలతో ఎర్ర మట్టి గుట్టను త్రవ్వుతూ చీకటి దందాకు తెర లేపిన వ్యక్తికి అంత ధైర్యమేమీటని పలువురు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఉదయం నుండి రాత్రి సమయం వరకు ట్రాక్టర్లు, టిప్పర్లలో ఎర్రమట్టి రవాణా అవుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులకు కనిపించడం లేదా అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి.

### ఉన్నతాధికారులు దృష్టి సారించరూ

ఎర్రమట్టి అక్రమ తరలింపు వ్యవహారంపై రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు, స్థానిక పరిపాలన అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకం, రవాణా జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని అక్రమ దందాకు శాశ్వతంగా కళ్లెం వేయాలని డిమాండ్ చేస్తున్నారు.





# అరుణోదయ నాగన్నకు ఘన నివాళులు

- ఆళ్లపల్లి మండల అరుణోదయ అధ్యక్షులు పూణెం సత్యం



**ఆళ్ళపల్లి,జులై9(ప్రజాజ్యోతి)** అరుణోదయ సాంస్కృతిక సేనాని, సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాపసభ గురువారం ఆళ్ళపల్లి మండల సెంటర్లో అరుణోదయ మండల అధ్యక్షులు కామ్రేడ్ పూనం సత్యం అధ్యక్షతన జరిగింది.కామ్రేడ్ నాగన్న చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి,సిపిఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి బట్టు ప్రసాద్,ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పూనెం రంగయ్య మాట్లాడుతూ. ప్రజాసాంస్కృతిక ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన విప్లవ గాయకుడు,పాటల ఊట కామ్రేడ్ అరుణోదయ నాగన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. విలాసవంతమైన జీవితాన్ని గడిపే అవకాశాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ తృణప్రాయంగా తిరస్కరించి పేద ప్రజల పక్షాన నిలబడిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ నాగన్న అని వారు కొనియాడారు.ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని స్వయంగా గత ప్రభుత్వం ఆహ్వానించినా, ప్రజల మధ్యే ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలనే సంకల్పంతో ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించిన అరుదైన విప్లవకారుడని పేర్కొన్నారు. నాగన్న తన జీవితాన్నే కాదు, తన కుటుంబాన్నీ ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన ఆదర్శవంతుడని అన్నారు. రైతులు, కూలీలు, అణగారిన వర్గాల బాధలను తన పాటల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా చైతన్యాన్ని రగిలించిన సాంస్కృతిక యోధుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. నాగన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటలు, ఆశయాలు, ప్రజల కోసం సాగించిన పోరాట స్ఫూర్తి ఎల్లప్పుడూ ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ పేద ప్రజల హక్కుల సాధన కోసం మరింత పట్టుదలతో ఉద్యమాలను కొనసాగించడమే నాగన్నకు అందించే గొప్ప నివాళి అని అన్నారు.జులై 11న ఇల్లెందులో నిర్వహించే నాగన్న సంస్మరణ సభకు ప్రజలు,కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంల్) న్యూడెమోక్రసి మండల నాయకులు మెస్సు గోపాల్, బొర్ర వెంకన్న,అటికం శేఖర్,బత్తిని సత్యం, ఎనగంటి లాజర్, బొమ్మెర్ల వీరన్న, పూనెం మంగ,తోట వీరభద్ర, పూనెం రమేష్,పూనెం బత్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

- హాజరైన పినపాక మండల సర్పంచులు, సెక్రటరీలు



**పినపాక,జులై 09(ప్రజాజ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జిపీడిపీ)పై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు భద్రాచలంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక మండల సర్పంచులు, సెక్రటరీలు గురువారం హాజరయ్యారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పన, నిధుల వినియోగం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులు శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి ప్రజలకు డ్రైనేజీ కష్టాలు



**చర్ల, జులై 09(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొద్దిపాటి వర్షం కురిసినా మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మోకాలి లోతు నీటిని దాటుకుంటూ రావాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు నిత్యావసర పనుల కోసం బయటకు వెళ్లాలంటే మురుగు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పారిశుధ్య లోపంతో దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తపల్లి గ్రామంలో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, మురుగు నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామ మహిళలు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చర్ల సీహెచ్ సీకి సదుపాయాలు కల్పించాలి

- సీపీఎం బృందం డిమాండ్

**చర్ల, జులై 09(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్ సీ)ను సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మచ్చ వెంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. వైద్యులు, సిబ్బంది, రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 30 పడకల ఆస్పత్రిగా కొనసాగుతున్నప్పటికీ తగిన మౌలిక సదుపాయాలు లేక రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.ఆస్పత్రిలో పడకలు ఉన్నప్పటికీ తగిన గదులు లేకపోవడంతో సేవల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని వెంటనే పూర్తి చేసి వైద్యశాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఓపీ నమోదు చేసేందుకు ప్రత్యేక స్థలం లేక సిబ్బంది వరండాలోనే రోగుల వివరాలు నమోదు చేస్తున్నారని దీనివల్ల రోగులకు అసౌకర్యం కలుగుతోందని తెలిపారు.ఆస్పత్రిలో అత్యవసర అంబులెన్స్ లేకపోవడం అత్యంత ఆందోళనకర విషయమని అర్ధరాత్రి వేళల్లో అత్యవసర రోగులను తరలించేందుకు సరైన వాహనం లేకపోవడం వల్ల ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని అన్నారు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి చర్ల సీహెచ్ సీకి అంబులెన్స్ నుకేటాయించాలని కోరారు.వైద్య సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉందని, డాక్టర్లు, ఏఎన్ ఎంలతో కలిపి 14 పోస్టులు భర్తీ కావాల్సి ఉండగా ప్రస్తుతం డిప్యుటేషన్ పై సిబ్బందితోనే సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. శాశ్వత నియామకాల ద్వారా వైద్య సేవలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.చర్ల సీహెచ్ సీపై చర్ల మండలంతో పాటు వెంకటాపురం, వాజేడు మండలాలు, ఛత్తీస్ గఢ్ సరిహద్దు గ్రామాలు, మారుమూల అటవీ ప్రాంతాల ప్రజలు ఆధారపడుతున్నారని తెలిపారు. రోజుకు సుమారు 200 మంది వరకు ఓపీ నమోదయ్యే అవకాశం ఉన్నందున ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఎక్స్ రే, స్కానింగ్, ఆక్సిజన్, వెంటిలేటర్ వంటి ఆధునిక వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యలపై త్వరలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని సీపీఎం బృందం తెలిపింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చి పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మచ్చ వెంకటేశ్వర్లు, పాల్గొన్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి కామ్రేడ్ మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు కామ్రేడ్ పొడుపుగంటి సమ్మక్క, కామ్రేడ్ బందెల చంటి, కామ్రేడ్ దొడ్డి హరినాగవర్మ, కామ్రేడ్ నవీన్, కామ్రేడ్ షారోని, కామ్రేడ్ వరలక్ష్మి , కామ్రేడ్ చంద్రం, కామ్రేడ్ నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ వైద్యశాలలో ఒకేరోజు ఆరు కాన్పులు

- వైద్యులు, సిబ్బందిని అభినందించిన కలెక్టర్, డిసీహెచ్ఎస్



**ఇల్లందు, జులై 9 (ప్రజా జ్యోతి )** ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో గురువారం రోజు ఆరు పసవాలు చేయడం జరిగిందని వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష వర్ధన్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అంకిత్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు లు నియమించిన ఇద్దరు గైనకాలజిస్టులు డాక్టర్ సింధు, డాక్టర్ ప్రియాంక లు విధుల్లో చేరినప్పటి నుండి ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య క్రమంగా పెరిగిందన్నారు. జులై నెల మొదటి వారంలోనే ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో 20 ప్రసవాలు, 14 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం జరిగిందని తెలిపారు. ఒకే రోజు చేసిన ఆరు ప్రసవాలలో మూడు సాధారణ, మూడు సిజేరియన్ ద్వారా చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టులు డాక్టర్ సింధు, డాక్టర్ ప్రియాంక, హెడ్ నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ అంకిత్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు లు అభినందనలు తెలిపినట్లు సూపరిండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు.

## కొత్తతండా(పి), రాంపురంలో కాంగ్రెస్ గ్రామశాఖ కమిటీల ఎన్నికలు



**టేకులపల్లి,జూలై09,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని కొత్తతండా(పి), రాంపురం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ కమిటీల ఎన్నికలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామశాఖ కమిటీల ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించి, కొత్త తండా(పి) గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా భూక్యా బాలకృష్ణ, రాంపురం గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా ఇస్లావత్ హరిలాల్‌ను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్ని కైన అధ్యక్షులను కోరం సురేందర్, లక్కినేని శ్యామ్ అభినందించి శుభాకాం క్షలు తెలిపారు.పార్టీ బలోపేతానికి, గ్రామస్థాయిలో కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామ కమిటీల సమన్వ యంతో పార్టీ కార్యక్రమాలను విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

## ఈతవాగు బ్రిడ్జికి ఎస్టిమేట్ ప్రక్రియ ప్రారంభం



**చర్ల, జులై 09(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఈతవాగు బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ వేగం పుంజుకుంది. ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు ఆదేశాల మేరకు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖ అధికారులు గురువారం నిర్మాణ స్థలాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు.బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ఎస్టిమేట్ తయారీ కోసం ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖకు చెందిన డిప్యూటీ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్‌లు స్థల పరిస్థితులు, సాంకేతిక అంశాలు, నిర్మాణ వ్యయానికి సంబంధించిన వివరాలను పరిశీలించి అంచనాల రూపకల్పన ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎస్టిమేట్‌ను త్వరితగతిన సిద్ధం చేసి సంబంధిత అధికారులకు సమర్పిస్తామని పరిపాలనా అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈతవాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగి పరిసర గ్రామాల ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# న్యాయవాదిపై కేసు.. కోర్టు విధుల బహిష్కరణ

- పోలీసుల తీరుపై దమ్మపేట బార్ అసోసియేషన్ తీవ్ర నిరసన
- రెండు రోజుల కోర్టు విధుల బహిష్కరణ
- కేసు ఉపసంహరించకుంటే హైకోర్టు, సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక



**దమ్మపేట, జూలై 9 (ప్రజాజ్యోతి):** సివిల్ వివాదంలో స్థానిక న్యాయవాదిపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ దమ్మపేట బార్ అసోసియేషన్ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టపరమైన విధివిధానాలను పక్కనబెట్టి, ఏకపక్షంగా వ్యవహరిస్తూ స్థానిక న్యాయవాది గోళ్ల భవాని కృష్ణ యాదవ్‌పై కేసు నమోదు చేశారని ఆరోపించింది. దీనికి నిరసనగా గురువారం, శుక్రవారం కోర్టు విధులను పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు, దమ్మపేట రెవెన్యూ మౌజా పరిధిలోని 273/1 సర్వే నంబర్‌కు సంబంధించిన భూ వివాదం పూర్తిగా సివిల్ స్వభావం కలిగినదేనని పేర్కొన్నారు. ఇలాంటి వ్యవహారాల్లో పోలీసులు నేరుగా జోక్యం చేసుకోవడం చట్టబద్ధం కాదని, అవసరమైతే ముందస్తు నోటీసులు జారీ చేసి, ఇరుపక్షాల వాదనలు విని, చట్టపరంగా వ్యవహరించాల్సి ఉండగా దమ్మపేట పోలీసులు ఆ నిబంధనలను పాటించలేదని ఆరోపించారు.ఘటనా స్థలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోయినా, కనీస విచారణ నిర్వహించకుండా కేవలం ఫిర్యాదు ఆధారంగా న్యాయవాది గోళ్ల భవాని కృష్ణ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఒక న్యాయవాదిపై ఇటువంటి చర్యలు చేపట్టడం న్యాయవాదుల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, చట్ట వ్యవస్థపై ప్రజల్లో అపోహలు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.నమోదు చేసిన కేసును చార్జ్ షీట్ దాఖలు చేయకముందే వెంటనే ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించి, చట్టబద్ధమైన విధానంలో సమస్యను పరిష్కరించాలని కోరింది. లేనిపక్షంలో తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా బార్ అసోసియేషన్ల మద్దతుతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేసింది.ఈ నిరసన కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళి మోహన్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్ర బాబు, ఉపాధ్యక్షుడు ముప్పిడి, సీనియర్ న్యాయవాదులు శ్యామ్ సుధాకర్, ఉడతనేని శ్రీనివాసరావు, మారం సతీష్ కుమార్, కాలం సంధ్యారాణి, తామ బాలరాజు, నల్లపు ఉదయ్ కుమార్, గద్దల అప్పారావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## చర్చి పునర్నిర్మాణానికి సహకరించండి

- : నీ ప్రార్థనా మందిరం నిర్వాహకుల విజ్ఞప్తి



**కొత్తగూడెం, జులై 9, ప్రజా జ్యోతి :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంగాబిషన్ బస్తిలో ఉన్న నీ ప్రార్థనా మందిరం చర్చి పునర్నిర్మాణానికి స్థానికులు సహకరించాలని ఆ సంస్థ నిర్వాహకులు కోరారు. గురువారం చర్చి నిర్మాణ స్థలం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2011 నుంచి గంగాబిషన్ బస్తిలో నీ ప్రార్థనా మందిరం చర్చి కొనసాగుతోందని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు వచ్చి ప్రార్థనలు నిర్వహించుకునేవారని తెలిపారు. ఇంతకాలం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రార్థనలు జరిగాయని చెప్పారు. కాలక్రమేణా చర్చి భవనం శిథిలావస్థకు చేరడంతో 2025లో దానిని తొలగించి, అదే స్థలంలో కొత్త భవనం నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించామని వివరించారు. అయితే చర్చి పక్కనే నివసిస్తున్న కొత్త రాజేష్, శోభన్‌తో పాటు మరికొందరు వ్యక్తులు కావాలనే నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చర్చికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు తమ వద్ద ఉన్నాయని, స్థలానికి క్రమబద్ధీకరణ పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. ఎన్నికల కారణంగా పట్టా ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. అన్ని చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ నిర్మాణానికి ఆటంకాలు కల్పించడం సరికాదన్నారు. గత ఏడాదిగా నీ ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు నిర్వహించుకునే వందలాది మంది విశ్వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చర్చి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకుని నిర్మాణ పనులు నిరంతరాయంగా సాగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో నీ ప్రార్థనా మందిరం నిర్వాహకులు కిన్నెర లక్ష్మణ్, మణి, లక్షి , సుశీల, అరుణ్ పాస్టర్, రాజు తదితరులు, స్థానికులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎండోమెంట్ సెల్ జిల్లా కన్వీనర్‌గా కస్తూరి సుధాకర్

- నూతన బాధ్యులకు నియామక పత్రాల అందజేత



**కొత్తగూడెం టౌన్ , జూలై 9 ( ప్రజాజ్యోతి )** భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ (ధార్మిక) సెల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్‌గా కస్తూరి సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు సూచన మేరకు రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాశ్, రాష్ట్ర కో–కన్వీనర్ నిరంజన్ దేశాయ్ సమక్షంలో నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో–కన్వీనర్లుగా పంజాల రమేష్, దండా రామచంద్రరావు, జిల్లా జాయింట్ కన్వీనర్‌గా చింతల శాంతకుమారిలకు కూడా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరి సుధాకర్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు, రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాశ్, రాష్ట్ర కో–కన్వీనర్ నిరంజన్ దేశాయ్, రాష్ట్ర జాయింట్ కన్వీనర్ ఈశ్వర్ ప్రగడ రామారావు, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు, ఎండోమెంట్ సెల్ లక్ష్యాలకు అనుగుణంగా నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ ధార్మిక రంగ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ప్రజలతో మమేకమవుతూ.. ప్రజల మధ్యే మాజీ ఎమ్మెల్యే తాటి

- సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తాటి వెంకటేశ్వర్లు









**దమ్మపేట, జూలై 9 (ప్రజాజ్యోతి):** బూర్గంపహాడ్–అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు శుక్రవారం పలు గ్రామాల్లో నిర్వహించిన సామాజిక, ఆధ్యాత్మిక, కుటుంబ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. గృహప్రవేశ వేడుకల్లో శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, అగ్నిప్రమాద బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పడం, దశదినకర్మ కార్యక్రమాల్లో నివాళులర్పించడం, ఆలయ అభివృద్ధికి విరాళం అందించడం ద్వారా తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు.వేలేరుపాడు మండలం శివకాశిపురం గ్రామానికి చెందిన ఆరే రాజేష్ నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న తాటి వెంకటేశ్వర్లు, ప్రత్యేక పూజల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను అందజేసి వారి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం వేలేరుపాడు మండలం జగన్నాథపురం గ్రామంలో ఇబ్రహీం నివాసంలో ప్రమాదవశాత్తు సంభవించిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబాన్ని పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పి, జరిగిన నష్టంపై ఆరా తీశారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించిన ఆయన, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు.అదే గ్రామంలో స్వర్గీయ అల్లాడ సత్యనారాయణ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే ములకలపల్లి మండలం చలమన్ననగర్ గ్రామంలో స్వర్గీయ మీడియం శివసన్నీ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.ఇక దమ్మపేట మండలం చలమప్పగూడెం గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ పశ్చిమాభిముఖ కోదండ రామాలయం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయ కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సన్మానించగా, ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయంగా రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి సహకారం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో రామ్‌లాల్, ఆరే రాంబాబు, నాగేశ్వరరావు, జ్ఞానేశ్వర్, సమీర్, డాక్టర్ శ్రీనివాస్, నయీమ్, గౌస్, మాజీ జడ్పీటీసీ సంజీవ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు..!

- విభజన చట్టంలోని హామీని వెంటనే అమలు చేయాలి
- సింగరేణి ఆధ్వర్యంలో బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తాం: కల్వకుంట్ల కవిత
- బయ్యారం ఇనుపరాతి గుట్టలను పరిశీలించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు





**ఇల్లందు, జులై 9, (ప్రజా జ్యోతి)** బయ్యారం ఉక్కు తెలంగాణ ప్రజల హక్కు అని, ముఖ్యంగా ఆదివాసీల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం ఇనుపరాతి గుట్టలను పరిశీలించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని స్పష్టంగా పొందుపరిచినప్పటికీ, రాష్ట్రం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఆ హామీ అమలుకు నోచుకోలేదని కవిత విమర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా బయ్యారం ఉక్కు అంశాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తోందని అన్నారు. బయ్యారం ప్రాంతంలో ఉన్న ఇనుప ఖనిజ సంపదను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అవసరమైతే ఛత్తీస్‌గఢ్ లోని ఉక్కు పరిశ్రమలతో అనుసంధానం చేసుకుని బయ్యారం ఉక్కు ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని సూచించారు. ముడి ఖనిజాన్ని ఇతర ప్రాంతాలకు తరలించడం కన్నా, ఇక్కడే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణకే అధిక ప్రయోజనం ఉంటుందని కవిత అభిప్రాయపడ్డారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సింగరేణి ఆధ్వర్యంలోనే బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. సింగరేణికి ఉన్న అనుభవం, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సామర్థ్యాన్ని ఉపయోగించి ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటైతే సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. బయ్యారం ఖనిజ సంపదపై మొదటి హక్కు ఈ ప్రాంత ప్రజలకే ఉండాలని, ముఖ్యంగా ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బయ్యారం ఉక్కు ప్రాజెక్టు కోసం తమ పార్టీ ప్రజలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తుందని, ఈ ప్రాంత ప్రజల కలను సాకారం చేసే వరకు పోరాటం ఆపబోమని కవిత స్పష్టం చేశారు. "బయ్యారం ఉక్కు కేవలం ఒక పరిశ్రమ కాదు ... ఇది తెలంగాణ హక్కు, ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశం" అని ఆమె పేర్కొన్నారు.

## ఆదివాసీల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు..!

- చాట్ల వనజ మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణం: కల్వకుంట్ల కవిత
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి..
- గుండాలకు నిపుణ వైద్యులు, రెండు అంబులెన్సులు ఏర్పాటు చేయాలి..
- పోడు భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్





**గుండాల, జూలై 9, ప్రజా జ్యోతి :**"ఆదివాసీల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు.. మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందక ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి" అని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం గుండాల మండలంలోని శంభుని గూడెం గ్రామంలో ఇటీవల వైద్య సేవలు అందక మృతి చెందిన చాట్ల వనజ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడిన కవిత, చాట్ల వనజ మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. నేటి సాంకేతిక యుగంలో కూడా సరైన వైద్యం అందక తల్లి, శిశువు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబం తీవ్ర పేదరికంలో ఉందని, ప్రభుత్వం తక్షణమే అన్ని విధాలా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి శాశ్వత భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. గుండాల వంటి మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ కనీస సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా అందుబాటులో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వైద్య సేవలు పొందలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గుండాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేసి, గైనకాలజిస్టుతో పాటు ఇతర నిపుణ వైద్యులను వెంటనే నియమించాలని కోరారు. అత్యవసర వైద్య సేవల కోసం కనీసం రెండు అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల అమాయక ప్రజలు బలవుతున్నారని అన్నారు. వైద్య నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం గుండాల మండల కేంద్రంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన కవిత, గిరిజనుల పోడు భూముల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, అటవీ శాఖ అధికారులు రైతులను వేధించడం, సాగు భూములను స్వాధీనం చేసుకునే చర్యలను నిలిపివేయాలని కోరారు. పోడు భూముల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్యం, విద్య, రహదారులు, కమ్యూనికేషన్ సదుపాయాలను మెరుగుపరచాలని ఆమె కోరారు. ప్రజల ప్రాణాలు, హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం గుండాల మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కవిత నివాళులర్పించారు. అమరవీరుల స్తూపాన్ని జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసం రామకృష్ణ, శంకర్, వీరన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుని మృతి



**గుండాల జులై 9 ప్రజా జ్యోతి** అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. గుండాల మండలంలోని శిమ్మనిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల సర్వాపురం గ్రామానికి చెందిన కిన్నెర శీను (27) మృతి చెందాడు . కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీను ఇంటి వద్ద నుంచి గుండాల వెళ్లాడని వెళ్లిన కొద్దిసేపట్లోనే గలవా వద్ద పడి ఉన్నాడని తెలుసుకొని వచ్చి చూడగా పడిపోయి ఉండడాన్ని గమనించి . ఏం జరిగిందో తెలియని స్థితిలో ఉన్నామన్నారు విషయం తెలుసుకున్న గుండాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పడి ఉన్న శ్రీను ను గుండాల తరలించగా అప్పటికే మృతి చెందాడు అన్న విషయాన్ని తెలుసుకున్న ఎస్సై శ్రావణ్ కుమార్ పోస్టుమార్టం నిమిత్తం డెడ్ బాడీని ఇల్లెందుకు తరలించారు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ



**కొత్తగూడెం టౌన్, జూలై 9 ( ప్రజాజ్యోతి )**కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ మున్సిపల్ కమిషనర్ సుజాతను కలిసి డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టడం, రామచంద్ర పార్కు అభివృద్ధి, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంపు, మిషన్ భగీరథ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ సుజాత రెండు రోజుల్లో 15 వ డివిజన్‌ను సందర్శించి మున్సిపల్ సిబ్బందితో కలిసి సమస్యలను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## చాట్లా వనజ మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణం

- తెలంగాణ రాష్ట్ర సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత

**గుండాల జులై 9 ప్రజా జ్యోతి** ఇటీవల మృతి చెందిన చాట్ల వనిజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ రాష్ట్ర సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. గురువారం మండలంలోని శంభుని గూడెం గ్రామంలో చాట్ల వనిజ కుటుంబాన్ని పరామర్శించారు.తన నివాసంలో కూర్చొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వనజ కుటుంబ సభ్యులతో జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకుని విచారణ వ్యక్తం చేశారు. వనిజ మృతి బాధాకరమని, నేటి హైటెక్ యుగంలో వైద్యం అందక మరణించడం పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమైనని అన్నారు. వనిజ నిరుపేద కుటుంబమని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, అన్నారు. గుండాలలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అన్ని వసతులు కల్పించి సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి, గైంకాలజిస్ట్ తో పాటు ఇద్దరు డాక్టర్లను రెండు అంబులెన్స్లను ఏర్పాటు చేయాలని కోరారు అనంతరం గ్రామ సెంటర్లో అక్కడికి చేరుకున్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడా రు ఈ ప్రాంతం పూర్తిగా గిరిజన ప్రాంతం అయినందున పోడు భూములకు పట్టాలివ్వాలని అన్నారు. రైతులు సాగు చేసుకునే తోడు భూములను ఫారెస్ట్ అధికారులు గుంజుకోవడం లాక్కోవడం సరికాదని ఫారెస్ట్ అధికారుల దాడులను ఆపాలని ప్రభుత్వం స్పందించి పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. పోడు భూముల విషయంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు యువత నడుంబిగించి తెలంగాణ రాష్ట్ర సేనలో ముందుండాలన్నారు. అనంతరం గుండాల మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు స్థూపాన్ని జాగృతి ఆధ్వర్యంలో మెయింటినెన్స్ చేస్తామన్నారు జయశంకర్ విగ్రహానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు, వాసం రామకృష్ణ, శంకర్, వీరన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.





# ఇదే నా శపథం..!

- "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లను"
- తప్పుడు ప్రచారాలకు ఒక్క మాటతో చెక్ పెట్టిన కల్వకుంట్ల కవిత
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలపై ఒకేసారి విమర్శల వర్షం
- ఫీనిక్స్ భూముల నుంచి కాళేశ్వరం వరకు ప్రభుత్వాలపై వరుస ఆరోపణలు
- సింగరేణి పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ..
- కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటన
- మెడికల్ బోర్డులు నిర్వహించకపోతే ఈ నెల 20 నుంచి నిరాహార దీక్ష హెచ్చరిక
- రైతులు, కార్మికులు, ఉద్యమకారుల హక్కుల కోసం నిరంతర పోరాటమే లక్ష్యమన్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 9, ప్రజా జ్యోతి:** "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు నేను మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లను... ఇదే నా శపథం." తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగూడెం వేదికగా చేసిన ఈ ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గురువారం పీవీకే–5 భూగర్భ గనిలో నిర్వహించిన 'బాయి బాట–2' కార్యక్రమంలో కార్మికులతో మమేకమైన అనంతరం, సూర్య ప్యాలెస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాను బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్తానంటూ జరుగుతున్న ప్రచారాన్ని పూర్తిగా ఖండిస్తూ, జీవితంలో ఆ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

### వెయ్యికి పైగా ఫిర్యాదులు..!

తమ పార్టీ ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలను చూసి బీఆర్ఎస్ నాయకత్వం భయపడుతోందని కవిత అన్నారు. పార్టీ పేరును నమోదు కాకుండా అడ్డుకునేందుకు ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు చేశారని, తమ పార్టీ వార్తలు, కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లకుండా మీడియాపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపించారు. తాను పార్టీ పెట్టిన తొలి ఆరు నెలలు అన్నిరాజకీయ పార్టీల వైఖరిని ప్రజల్లో ఎండగడతానని, ఆ తర్వాత పూర్తిగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. అయితే తమ పార్టీ ఎదుగుదలను చూసి బీఆర్ఎస్ అసహనానికి గురై తాను తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నానంటూ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఆ ప్రచారాలకు చెక్ పెడుతూ "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి వెళ్లను... ఇదే నా శపథం" అని మరోసారి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో మహిళలపై సభ్యతలేని వ్యాఖ్యలు చేస్తున్నారని, అలాంటి చర్యలను ఇకపై సహించబోమని హెచ్చరించారు. క్విడ్ ప్రో కో, అవినీతి అంశాలపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

### బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు..!

ఫీనిక్స్ సంస్థకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు కేటాయించడాన్ని ప్రస్తావిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి కిటికీలు తెరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తలుపులు తెరిచిందని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వాలు చేసిన భూకేటాయింపులన్నింటినీ సమీక్షించి, నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన ప్రతి గజం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్లను తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల త్యాగాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రంలో కొద్దిమందికే ప్రయోజనం చేకూరేలా పాలన సాగుతోందని విమర్శించారు.

### సింగరేణికై ప్రత్యేక కార్యాచరణ..!

సింగరేణి కోల్‌బెల్ట్ ప్రజలకు జీవనాధారమని, సంస్థను బలోపేతం చేసేందుకు తమ పార్టీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వస్తుందని కవిత తెలిపారు. ఓపెన్‌కాస్ట్ గనులు సంస్థకు ఆర్థిక లాభాలను తీసుకొస్తే, భూగర్భ గనులు వేలాది స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తాయని పేర్కొన్నారు. అందువల్ల రెండు విధానాల మధ్య సమతుల్యత ఉండేలా విధానాలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడం వల్లే సింగరేణిపై తీవ్ర ఆర్థిక భారం పడిందన్నారు. కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు కొనుగోలు చేసే పరిస్థితి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఒక నిబంధన, కార్మికులకు మరో నిబంధన అమలు చేయడం సరికాదన్నారు. నిజాం కాలంలో సింగరేణికి చెందిన 17 బొగ్గు గనులను కేంద్రం స్వాధీనం చేసుకుందని, ఇప్పటివరకు ఒక గని మాత్రమే తిరిగి వచ్చిందన్నారు. మిగిలిన 16 గనులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. తాడిచర్ల–2తో పాటు అన్ని బొగ్గు గనులను సింగరేణే నిర్వహించాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు దక్కవని అన్నారు. ముఖ్యమంత్రి బావమరిదికి చెందిన ఓపెన్‌కాస్ట్ గని వ్యవహారాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఒకప్పుడు సింగరేణిలో 62 వేల మంది శాశ్వత ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం నెలలో రెండుసార్లు మెడికల్ బోర్డులు నిర్వహించాలని, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఈ నెల 20 నుంచి రామగుండంలో నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

### కాళేశ్వరం.. హరీశ్‌రావుపై విమర్శలు..!

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. రైతు సమస్యలను పక్కనబెట్టి రాజకీయ ఆరోపణలకే పరిమితమైందన్నారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి రైతు సభ నిర్వహించే ముందు మహబూబ్‌నగర్ జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించిన రైతులపై నమోదైన కేసులు, రౌడీషీట్లు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథి రెడ్డి ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల రైతులకు నష్టం జరుగుతోందని ఆరోపించారు. హరీశ్‌రావుపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, ఇప్పటికే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి మరోసారి మంత్రి పదవి కావాలని కోరడం హాస్యాస్పదమన్నారు. నారాయణ, చైతన్య విద్యాసంస్థలకు పాలు సరఫరా చేయడం కంటే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విజయ డెయిరీ ద్వారా పాలు సరఫరా చేసే విధానం అమలు చేయాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో తీర్మానం చేయించాలని, కేంద్ర కార్మిక చట్టాలపై స్పష్టమైన వైఖరి తీసుకోవాలని కోరారు. సింగరేణి కార్మికుల హక్కులు, తెలంగాణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.